

చెస్ పోటీలకు శ్రీగురువర్షిణి

జాతీయస్థాయి చెస్ పోటీలకు తిరుపతికి చెందిన శ్రీగురువర్షిణి ఎంపికైంది. విశాఖపట్నంలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచింది. - 8లో



అగ్నిప్రమాదంపై అనుమానాలెన్నో

రైలు బోగీలో జరిగిన అగ్నిప్రమాదం పలు అనుమానాలకు తావిస్తోంది. నగరంలో ఆకతాయిల తాకిడి అధికమైంది. - 8లో



రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

తమిళనాడుకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్పెషల్ బ్రాంచ్ పోలీసులు సీజ్ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక పోటీలకు 16 మంది హాజరు



విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యబృందం

తిరుపతి ఎడ్యుకేషన్ : కడపలోని డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్ 4, 5వ తరగతుల్లో ప్రవేశాలకు సంబంధించి ఈ నెల 11, 14వ తేదీల్లో తిరుపతిలోని ఎస్వీయూ స్టేడియంలో ఎంపిక పోటీలను నిర్వహించారు. తిరుపతి జిల్లాలోని వివిధ మండలాల నుంచి హాజరైన 16 మంది చిన్నారులకు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శశిధర్, డీఎస్ఏ కోచ్‌ల ఆధ్వర్యంలో ఆరు రకాల ఈవెంట్లలో పరీక్షలు నిర్వహించారు. అలాగే వీరందరికి వైద్య బృందం ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి ఎంపికైన అభ్యర్థుల జాబితాను శాప్‌కు పంపించినట్లు డీఎస్‌డీఓ తెలిపారు. ఈ జాబితాను పరిశీలించి ఎంపిక చేసిన అభ్యర్థుల వివరాలను త్వరలో ఆన్‌లైన్‌లో శాప్ ప్రకటించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేటి నుంచి లెక్చరర్ పోస్టుల భర్తీకి పరీక్షలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీఆర్వో

తిరుపతి అర్బన్: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో లెక్చరర్ పోస్టుల భర్తీకి మంగళవారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు జిల్లాలోని ఆరు కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన పరీక్షల ఏర్పాట్లపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ తిరుపతి జిల్లాలో ఆరు పరీక్ష కేంద్రాల్లో జరగనున్న లెక్చరర్ పోస్టుల పరీక్షలకు 6,412 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు జరగనున్నాయని, పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు పక్కాగా ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు, వైర్‌లెస్ హెడ్ సెట్స్, తదితర ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి ఉండదన్నారు. జిల్లాలో పుత్తూరు సిద్ధార్థ, రేణిగుంట రోడ్డులోని చదలవాడ రమణమ్మ ఇంజినీరింగ్ కళాశాల, తిరుపతి జూపార్క్ వద్ద ఉన్న అయాన్ డిజిటల్ సెంటర్, గూడూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలతోపాటు ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు గంట ముందే హాజరు కావాలని, నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని తెలిపారు.

ఆలోచనలకు పదును.. అద్భుతాలకు అదును

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి, వారిలోని వైజ్ఞానిక ఆలోచనలకు పదును పెట్టాలనుకునే ఉపాధ్యాయులెందరో.. తమ పిల్లలను శాస్త్రవేత్తలుగా చూడాలని, వారు ఆ దిశగా ఎదిగి మంచి గుర్తింపు తెచ్చుకోవాలనే కలలు కనే తల్లిదండ్రులెందరో పరితపిస్తుంటారు. చిన్నారుల ఆలోచనలకు వేదికను కల్పించే సమయం రానే వచ్చింది. విద్యార్థుల్లో దాగిన వైజ్ఞానిక నైపుణ్యాలను వెలికితీసి, శాస్త్రీయ సాంకేతికపై ఆసక్తి కలిగించి, వినూత్న ఆవిష్కరణలు చేయించి, భావిభారత శాస్త్రవేత్తలుగా రూపొందించేందుకు వేదికగా నిలిచే ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనకు దరఖాస్తు చేసుకోవడానికి సమయం ఆసన్నమైంది.



గతంలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థుల ప్రయోగాత్మక నమూనాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్(ఫైల్)

తిరుపతి జిల్లాలో ఇన్‌స్పైర్ అవార్డుల వివరాలు

విద్యాసంవత్సరం	దరఖాస్తులు	అవార్డులకు ఎంపికైనవి	రాష్ట్ర స్థాయికి ఎంపికైనవి	జాతీయ స్థాయికి ఎంపికైనవి
2022-2023	4025	373	33	03
2023-2024	2762	286	నిర్వహించాల్సి ఉంది	
2024-2025	2434	254	నిర్వహించాల్సి ఉంది	



ఇన్‌స్పైర్ మనక్ దరఖాస్తుకు సెప్టెంబరు 15 వరకు గడువు

- 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు అవకాశం
- అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : శాస్త్రవేత్తల కృషితోనే దేశాభివృద్ధి సాధ్యం. విద్యార్థి దశ నుంచే పిల్లలు శాస్త్రవేత్తలుగా ఎదిగేలా ఉపాధ్యాయుల కృషి తప్పనిసరి. అందులో భాగంగానే విద్యార్థుల్లో శాస్త్రీయ, వైజ్ఞానిక ఆలోచనలతో సృజనాత్మకతను ప్రోత్సహించి, వారిని భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ ప్రతిష్టాత్మకంగా ఇన్‌స్పైర్ మనక్ అవార్డులను ఏటా ఇస్తోంది. విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఉపకార వేతనాలు అందించాలని కేంద్రం నిర్ణయించింది. కేంద్ర శాస్త్ర, సాంకేతిక మండలి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా ఏటా ఇన్‌స్పైర్ మనక్ పేరుతో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో సైన్స్ ఎగ్జిబిషన్, పోటీలు నిర్వహిస్తున్నాయి. 2025-26 విద్యా సంవత్సరంలో ఈ అవార్డులకు విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎనిమిది ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలు, ప్రభుత్వ, జెడ్పీ హైస్కూళ్లు 290, ప్రైవేటు అన్‌ఎయిడెడ్ 629 పాఠశాలల్లోని విద్యార్థులు ఇన్‌స్పైర్ మనక్‌కు సెప్టెంబరు 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆన్‌లైన్‌లో నమోదుకు అర్హతలివీ..

- ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులు ఇన్‌స్పైర్ మనక్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.
- ఈ-మెయిల్, ఐడీ, పాస్‌వర్డ్ ద్వారా పూర్తి వివరాలను పొందుపరచాల్సి ఉంటుంది.
- దరఖాస్తులు పంపేందుకు సెప్టెంబరు 15వ తేదీ వరకు గడువు ఉంది.
- డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా, స్వచ్ఛభారత్, మేక్ ఇన్ ఇండియా, సమాజాభివృద్ధి, క్లీన్ ఇండియా, సమాజానికి ఉపయోగపడే ఆలోచనలతో కూడిన ప్రాజెక్టులను రూపొందించాల్సి ఉంటుంది.
- ''డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐఎన్ఎస్‌పీఐఆర్‌ఈఏడబ్ల్యూఆర్‌డీఎస్-డీఎస్‌టీ.జీఓవీ.ఇన్'' అనే వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఇన్‌స్పైర్ మనక్ నిర్వహణ ఇలా..

- ముందుగా పాఠశాల స్థాయిలో ఐడియా కాంపిటీషన్ నిర్వహించాలి.
- మెరుగైన ఆలోచనలు ఉన్న వారిని ప్రోత్సహించాలి.
- స్థానిక సమస్యను తీర్చేలా ఆలోచన ఉండాలి.
- విద్యార్థి పేరు, మొబైల్ నంబరు ఎంటర్ చేయాలి.
- ప్రాజెక్టు వివరాలను రాతపూర్వకంగా పొందుపరచి సంబంధిత రైటప్‌ను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి.
- ప్రాజెక్టు పేరు, వివరణకు సంబంధించిన అంశాలు ఉండేలా సరిచూసుకోవాలి.
- రెండు నెలల్లో ఎంపిక పూర్తి చేసి, జిల్లా స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టుల వివరాలు, విద్యార్థుల పేర్లను ప్రకటించి జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో అవకాశం కల్పిస్తారు.
- జిల్లా స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టులకు రాష్ట్ర స్థాయికి, అక్కడ గెలుపొందితే జాతీయ స్థాయికి పంపిస్తారు.

పోటీలు.. ప్రోత్సాహకాలు..

- దరఖాస్తు చేసుకున్న ప్రాజెక్టుల్లో ఉత్తమమైన వాటిని కేంద్ర ప్రభుత్వం గుర్తించి అవార్డులకు ఎంపిక చేస్తుంది. జిల్లా స్థాయిలో వైజ్ఞానిక ప్రదర్శనల్లో ఉత్తమమైన వాటిని రాష్ట్రస్థాయికి, అక్కడ ప్రతిభ చాటితే జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. ఈ ప్రాజెక్టులకు ప్రభుత్వం పేటెంట్ హక్కులను కల్పించడంతోపాటు రాష్ట్రపతి భవన్, జపాన్‌ను సందర్శించే అవకాశాన్ని కల్పిస్తుంది.
- అవార్డులకు ఎంపికైన ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన విద్యార్థికి రూ.10వేలు ప్రోత్సాహకాన్ని అందిస్తుంది.
- రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన బాల మేధావులకు రూ.25 వేల వరకు తమ నమూనాలను మరింత మెరుగుపరుచుకునేందుకు శాస్త్ర, సాంకేతిక మండలిశాఖ అదనపు నిధులను మంజూరు చేస్తుంది.



ఢిల్లీలో ప్రదర్శించిన కోకోనట్ డ్రిల్లర్ అండ్ బ్రేకర్‌తో విద్యార్థిని ఎం.వాణి, గైడ్ టీచర్ ఎస్‌జే.కామేశ్వరి(ఫైల్)



అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన బాయిల్డ్ ఎగ్ షెల్ పీలర్‌తో విద్యార్థిని గొల్లపల్లి రేష్మ, గైడ్ టీచర్ పి.మునిరెడ్డి (ఫైల్)

అన్ని పాఠశాలలు దరఖాస్తు చేసుకోవాలి



విద్యార్థులను బావిభారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అడుగులు పడేలా జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు ఇన్‌స్పైర్ మనక్‌కు దరఖాస్తు చేసుకోవాలి. సమాజంలోని సమస్యలను శాస్త్రీయంగా పరిష్కరించే సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఇన్‌స్పైర్ మనక్ చక్కని వేదిక. రాష్ట్రంలోనే ఎక్కువ దరఖాస్తులు చేసుకున్న జిల్లాగా తిరుపతి జిల్లాను ముందు వరుసలో నిలిపేందుకు అవసరమైన సహాయ సహకారాలను డీవైఈఓలు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అందించాలి. -కేవీఎన్ కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి, తిరుపతి

శాస్త్రవేత్తలుగా రాణించాలి



ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా రాణించేందుకు అడుగులు వేయాలి. భావి భారత శాస్త్రవేత్తలుగా ఎదగాలనుకునే వారికి ఇన్‌స్పైర్ మనక్ ఒక వరం. సమాజ సమస్యలను శాస్త్రీయ పరిష్కారాలను చూపగలిగే వినూత్న ఆలోచనలతో రూపొందించిన ప్రాజెక్టుల ద్వారా ఇన్‌స్పైర్ మనక్‌కు ఎంపిక కావడంతో భవిష్యత్తు శాస్త్రవేత్త కలను సాకారం చేసుకోవచ్చు. ప్రతి విద్యార్థీ దరఖాస్తు చేసుకునేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి.

– భానుప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి, తిరుపతి

తప్పని సర్వర్ తిప్పలు

తిరుపతి సిటీ: ఏపీఈఏపీసెట్-2025కు సంబంధించి ఇంజినీరింగ్ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఆదివారం నుంచి మొదలై ఈ నెల 18వ తేదీ వరకు కొనసాగనుంది. దీంతో విద్యార్థులు వెబ్‌ఆప్షన్ల ఎంపిక ప్రక్రియను పూర్తి చేసుకునేందుకు నెట్‌సెంటర్ల వెంటపడ్డారు. దీంతో తిరుపతి నగరంలోని ఇంటర్‌నెట్ సెంటర్లు విద్యార్థులు, తల్లిదండ్రులతో కిటకిటలాడుతున్నాయి. కానీ సర్వర్ స్లోగా ఉండడం, పది నిమిషాల పాటు సర్వర్ పనిచేసి తర్వాత మొరాయించడంతో విద్యార్థులు అవస్థలు వర్ణనాతీతం. గంటల కొద్దీ నెట్ సెంటర్లలో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సర్వర్ సమస్య రాకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఏఎన్ఎం బదిలీల్లో కూటమి పెత్తనం

ఏఎన్ఎం బదిలీల్లో కూటమి పెత్తనం జోరందుకుంది. ప్రజాప్రతినిధుల జోక్యంతో గందరగోళమైంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులపై ఒత్తిడి తెచ్చి 80 శాతం ముందస్తు బుకింగ్ చేసుకుంది. ఆపై పలువురు ప్రజాప్రతినిధుల అనుచరులు తెరపైకి తళుక్కుమన్నారు. కోరుకున్న స్థానానికి బదిలీ అయ్యేందుకు రూ.30 వేల నుంచి రూ. లక్ష వరకు వసూలు చేశారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఈ దందాతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు జుట్టు పీక్కుంటున్నారు. కూటమి పెత్తనంపై ఏఎన్ఎం, వైద్య సంఘ నేతలు మండిపడుతున్నారు.

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు బెదిరింపులు
- 80 శాతం ముందస్తు బుకింగ్‌లు
- ఆపై కొందరు ప్రజాప్రతినిధుల పేరుతో అనుచరుల దందాలు
- కోరుకున్న స్థానానికి బదిలీ చేస్తామంటూ రూ.30వేల నుంచి రూ.లక్ష వరకు వసూళ్లు
- మండిపడుతున్న ఏఎన్ఎం, వైద్య సంఘ నేతలు



వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం

తిరుపతి సాక్షిటాస్క్‌ఫోర్స్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 746 మంది గ్రేడ్-3 ఏఎన్ఎంలున్నారు. వీరిని బదిలీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో 693 మందికి సాధారణ బదిలీలు చేయగా.. మిగిలిన వారిని మెడికల్ గ్రౌండ్స్ కింద చూపించారు. తొలుత మాన్యువల్ ప్రకారం బదిలీలు చేయాలని నిర్ణయించారు. కూటమి నాయకులు, పలువురు ప్రజాప్రతినిధుల జోక్యంతో ఈ ప్రక్రియకు ఆటంకం ఏర్పడింది.

సిఫార్సుల వెల్లువ

బదిలీల ప్రకటనతో ఏఎన్ఎంలు వారికి అనుకూలమైన ప్రాంతాలు వరించేలా ఎవరికి వారు పోటీలు పడ్డారు. కూటమి బడా నేతలు, ఎమ్మెల్యేల వద్దకు క్యూకట్టారు. వారి సిఫార్సు లేఖలను బదిలీలకు జత చేశారు. ఈ సిఫార్సులు జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు కుప్పలు తెప్పలుగా వచ్చాయి. పలువురు ఎమ్మెల్యేలతో పాటు కూటమిలోని చోటామోటా నాయకులు కూడా సొంత లెటర్లతో సిఫార్సులు పంపారు. ఎవరికి వారు సత్తా చాటుకోవాలని శాఖపై పట్టుబట్టారు. సిఫార్సులతో పాటు ఫోన్లు చేసి అధికారులను విసిగించారు. వారి హోదాను గుర్తు చేస్తూ.. భయభ్రాంతులకు గురిచేశారు. ఈకారణంగా ఎవరి సిఫార్సుకు తలొగ్గాలో తెలియక అధికారులు తలలు పట్టుకున్నారు. బదిలీల ప్రక్రియను కొన్ని రోజుల పాటు వాయిదా వేస్తూ వచ్చారు.

వైద్య ఆరోగ్య శాఖపై బురద

కూటమి నేతల జోక్యం, ఒత్తిడి, సిఫార్సులను అధిగమించేందుకు జిల్లా యంత్రాంగం ఆదేశాల మేరకు శాఖ అధికారులు బదిలీల్లో జూమ్ కౌన్సెలింగ్‌ను తీసుకొచ్చారు. ఈనెల 8వ తేదీ నుంచి జూమ్ ద్వారా కౌన్సెలింగ్‌ను ప్రారంభించారు. 11వ తేదీ రాత్రితో ఈ ప్రక్రియను ముగించారు. అయితే చాలా మందికి ఆశించిన ప్రాంతాలు రాక అయోమయానికి గురవుతున్నారు. మరికొందర్ని దూర ప్రాంతాలకు బదిలీ చేశారు. బదిలీల ప్రక్రియ ముగిసిన ఇప్పటికీ సిఫార్సుల గోల తగ్గడం లేదు. అధికారులపై కొందరు ఏఎన్ఎంలు ప్రజాప్రతినిధులు, కూటమి నేతల ద్వారా ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో ఆర్డర్ పత్రాలు ఇచ్చేందుకు కూడా అధికారులు వెనుకడుగు వేస్తున్నారు. ఈ కారణంగా శాఖపై బురద పడుతోంది. కార్యాలయంలో కొంతమంది సిబ్బంది ముడుపులు తీసుకుని ఇష్టానుసారంగా బదిలీలు చేయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇదంతా కూటమి నేతల జోక్యంతో వచ్చిన యవ్వారమని ఏఎన్ఎం, వైద్య సంఘ నేతలు మండిపడుతున్నారు.

సహాయకులతో వసూళ్లు?

కొందరు ఏఎన్ఎంలే వారి సహాయకులకు కాసులతో ఆశ చూపించారు. తాను అనుకున్న స్థానానికి బదిలీ చేయిస్తే అడిగింత ఇచ్చుకుంటానని ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో ఏఎన్ఎంల బదిలీలకు భారీగా డిమాండ్ ఏర్పడింది. దీన్ని అదునుగా చేసుకుని కొందరు రెచ్చిపోయారు. వారు ఒక్కో బదిలీకి రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేసినట్లు పలువురు ఏఎన్ఎంలు ఆరోపిస్తున్నారు.

ముందస్తు బుకింగ్‌లు

ఏఎన్ఎంల బదిలీల విషయంలో డిమాండ్ పెరిగే కొద్దీ పలువురు కూటమి నేతలు, ప్రజాప్రతినిధులు రంగంలోకి దిగారు. తమ ప్రాంతంలో తమకు తెలియకుండా బదిలీలు చేయకూడదని హుకుం జారీ చేశారు. తమకు అనుకూలమైన వారినే వేయించుకుంటామని అధికారులపై ఒత్తిడి తెచ్చారు. ముందస్తుగానే 80శాతం ప్రాంతాలను వారి గుప్పెట్లోకి తీసుకున్నారు. అక్కడికి రావాల్సిన వారిని వారే ఎంపిక చేసి అధికారులకు జాబితా పంపారు. కాగా వారి ఒత్తిడికి అధికారులు తలొగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. లేకుంటే ఇక్కడి నుంచి శాఖలో పనిచేసే అధికారులను బదిలీ చేయిస్తామని బెదిరింపులకు దిగినట్లు తెలుస్తోంది. దీంతో వారు చేసేది లేక వారు చెప్పినట్లు బదిలీలను ముగించారు. కొందరు ప్రజాప్రతినిధులకు వ్యతిరేకంగా ఉన్న ఏఎన్ఎంలు, వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్న ఏఎన్ఎంపై కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారు. వారిని సుదూర ప్రాంతాలకు బదిలీ చేయించాలని ప్రయత్నాలు చేశారు.

గందరగోళం ఏమీ లేదు



జిల్లా యంత్రాంగం ఆదేశాల మేరకు కౌన్సెలింగ్ నిర్వహించాం. జూమ్ పద్ధతిలో ప్రక్రియను పూర్తిచేశాం. త్వరలో ఆర్డర్లు కూడా ఇచ్చేస్తున్నాం. మాకైతే ఎవరినీ ఇబ్బంది పెట్టించాల్సిన అవసరం లేదు. శాఖలో పనిచేసేవారు మా కుటుంబ సభ్యులే. వాళ్లను ఇబ్బంది పెట్టించాలని మేము ఏరోజూ కోరుకోం. ఇప్పటి వరకు వారికి ఇబ్బంది లేకుండా చూడాలని మా ప్రయత్నం చేస్తున్నాం. గందరగోళం ఏమీ లేదు. తప్పులుంటే కచ్చితంగా సరిదిద్దేలా చూస్తాం. సమస్యలుంటే నేరుగా తీసుకురావొచ్చు.

–సుధారాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, చిత్తూరు

వెలుగులో చీడపై మహిళల కన్నెర్ర

- బ్యాంకు వద్ద ఆందోళనకు దిగిన డ్వాక్రా మహిళలు
- వైఎస్సార్ సీపీ నేత భూమన అభినయ్‌రెడ్డి మద్దతు



డ్వాక్రా మహిళలతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత భూమన అభినయ రెడ్డి



ఇండియన్ బ్యాంకు ఉద్యోగిని నిలదీస్తున్న మహిళలు

తిరుపతి తుడా: వెలుగులో చీడ పురుగులుగా మారిన సిబ్బందిపై డ్వాక్రా సంఘాల మహిళలు కన్నెర్ర చేశారు. తమ నగదుకు భద్రత కరువడంతో సభ్యులు రోడ్డెక్కారు. ఆర్పీ హేమలత రూ.70 లక్షలు స్వాహా చేయడం వెనుక దాగి ఉన్న మెప్మా అధికారులు, బ్యాంకు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని గళమెత్తారు. ఆర్పీ ద్వారా మోసపోయిన పలు డ్వాక్రా సంఘాల మహిళలు లింగేశ్వరనగర్‌లోని ఇండియన్ బ్యాంకు వద్దకు చేరుకుని సోమవారం ఆందోళనకు దిగారు. మహిళలు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో అధికారులు బ్యాంకు గేటుకు తాళాలు వేశారు. దీంతో ఆగ్రహించిన మహిళలు గేటు విరగ్గొట్టి లోపలికి చొచ్చుకెళ్లారు. రిసోర్స్ పర్సన్ హేమలత అవినీతి అక్రమాల్లో బ్యాంక్ సిబ్బంది ప్రమేయం ఉందని నిలదీశారు. బ్యాంకు మేనేజర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళ సంఘాల సభ్యులకు మద్దతుగా వైఎస్సార్ సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయరెడ్డితోపాటు, ఆ పార్టీ నాయకులు, సీపీఐ నేతలు ఆందోళనలో పాల్గొన్నారు. విషయం పెద్దది కావడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. బ్యాంకు నుంచి బయటికి వెళ్లాలని కోరారు. దీంతో మహిళలు బ్యాంకు నుంచి బయటకు వచ్చారు. సంబంధిత బ్యాంకు మేనేజర్ మహిళలకు వివరణ ఇచ్చారు. అప్పటికీ మహిళలు వెనక్కి తగ్గకపోవడంతో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయాలని పోలీసులు మహిళలను కోరారు. దీంతో ఆర్పీ హేమలతతోపాటు బ్యాంక్ సిబ్బందిపై డ్వాక్రా సంఘాల సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నగదు స్వాహా విధానం ఆశ్చర్యం

డ్వాక్రా సంఘాల నగదును కాజేసిన విధానం ఆశ్చర్యం కలిగిస్తోందని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ రెడ్డి అన్నారు. నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలకు భూమన అభినయ్ మద్దతుగా నిలిచి ఆందోళనలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి నియోజకవర్గంలో 44 వేల మందికి పైగా డ్వాక్రా సంఘాల సభ్యులు ఉన్నారన్నారు. వారి డబ్బులు ఏమాత్రం భద్రమో తేల్చాలన్నారు. డ్వాక్రా సంఘాల నగదుపై ఆడిట్ నిర్వహించి మహిళల్లో నెలకొన్న ఆందోళను తొలగించాల్సిన బాధ్యత మెప్మా అధికారులదేనన్నారు. ఎస్ఎల్ఎఫ్ పరిధిలో సభ్యులందరి సమక్షంలో ఆడిట్ చేపట్టాలని డిమాండ్ చేశారు. అవినీతి అక్రమాలకు పాల్పడిన ఆర్పీపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. టీఎల్ఎఫ్, ఎస్ఎల్ఎఫ్‌లపై లోతైన విచారణ జరిపితేనే నిజాలు వెలుగు చూస్తాయన్నారు. డ్వాక్రా సంఘాల పొదుపు ఇతర రుణాలను కాజేసిన ఆర్పి హేమలతపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ నేతలు పెంచలయ్య, విశ్వనాథ్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

తెలుగు గంగ ప్రాజెక్ట్ ఎస్ఈగా రాధాకృష్ణమూర్తి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఈ

తిరుపతి అన్నమయ్యసర్కిల్: తెలుగుగంగ, గాలేరు-నగరి ప్రాజెక్టుల సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ)గా డి.రాధాకృష్ణమూర్తి సోమవారం తిరుపతిలోని నీటి పారుదల శాఖ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రస్తుతం తెలుగుగంగ ప్రాజెక్ట్ వెంకటగిరిలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. పదోన్నతి జాబితాలో ఉన్న ఆయన్ని సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా పూర్తి అదనపు బాధ్యతలతో నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

క్లుప్తంగా

రొయ్యలు గుంతల కలుషిత నీటిపై ఫిర్యాదు

చిట్టమూరు: మండలంలోని పిట్టివానిపల్లెలో రొయ్యలు గుంతల్లోని రసాయనాలు కలిసిన కలుషిత నీటిని గ్రామంలోని వరి పొలాల్లోకి వదులుతున్నారని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు గ్రామస్తులు సోమవారం ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ పిట్టి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మల్లాం గ్రామానికి చెందిన ఓ భూస్వామి పిట్టివానిపల్లెలో సుమారు 50 ఎకరాల్లో రొయ్యలు సాగు చేస్తున్నాడన్నారు. అందులో 12 ఎకరాలకు మాత్రమే మత్స్యశాఖ అధికారుల నుంచి అనుమతులు తీసుకుని మొత్తం పొలంలో అక్రమంగా అనుమతులు లేకుండా రొయ్యలు సాగు చేస్తున్నాడన్నారు. రొయ్యలు గుంతల్లోని కలుషిత నీరు బయటకు పోవడానికి వీలు లేకపోయినా తను ఇష్టానుసారంగా గ్రామంలోకి, వరి పొలాల్లోకి వదులుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు తమ ఫిర్యాదుకు 105 రోజుల లోపల పరిష్కారం చూపుతామని తెలిపారన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

సత్యవేడు: తమిళనాడుకు ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్పెషల్ బ్రాంచ్ పోలీసులు గుర్తించి, వాటిని సీజ్ చేసి, పోలీసులకు అప్పగించడంతోపాటు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామస్వామి తెలిపారు. తమిళనాడుకు అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అదడంతో పోలీసులు సత్యవేడు- దాసుకుప్పం రహదారిపై నిఘా ఉంచారు. ఆదివారం అర్ధరాత్రి బీసీ గురుకుల పాఠశాల సమీపంలో తమిళనాడు మార్గంలో ఎస్‌ఎం కండ్రిగ దళితవాడ దాటుతుండగా ఎస్‌బీఐ పోలీసులు, స్థానిక పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బి.మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25, 26 తేదీల్లో అండర్-14 బాలురు, 28, 29 తేదీల్లో సీనియర్ పురుషులకు, అలాగే ఆగస్టు 7, 8 తేదీల్లో అండర్-14 బాలికలకు ఈ పోటీలను తుమ్మలగుంట గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అండర్-14 బాలురు, బాలికల విభాగాల్లో మొదటి రెండు స్థానాలు సాధించిన జట్లకు ఒక్కో విభాగానికి రూ.10వేలు, రూ.5వేలు, సీనియర్ పురుషుల పోటీల్లో మొదటి రెండు స్థానాలు సాధించిన జట్లకు రూ.20వేలు, రూ.10వేలు నగదు బహుమతి ఉంటుందన్నారు. వివరాలకు 94902 52821ను సంప్రదించాలన్నారు.

అగ్నిప్రమాదంపై అనుమానాలెన్నో


సంఘటన స్థలానికి చేరుకున్న రైల్వే భద్రతా దళాలు, అధికారులు, స్థానికులు


రైలు బోగీలో ఎగసిపడుతున్న మంటలు

- ఆకతాయిలకు అడ్డాగా లూప్‌లైన్ పరిసరాలు
- వారిపైనే అనుమానాలు
- విచారణలో వెలుగుచూసేనా..?

తిరుపతి అన్నమయ్యసర్కిల్: తిరుపతి రైల్వేస్టేషన్‌లో సోమవారం మధ్యాహ్నం లూప్‌లైన్‌లో ఆగి ఉన్న ఇసాక్ ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలో చోటు చేసుకున్న అగ్ని ప్రమాద సంఘటన పలు అనుమానాలకు తావిస్తోంది. ఇటీవల నగరంలో ఆకతాయిల తాకిడి అధికమైంది. వారికి హోటల్ భీమాస్ వెనుక ప్రాంతంలోని రైల్వేట్రాక్ (లూప్‌లైన్) పరిసరాలు అడ్డాగా మారాయి. కూతవేటు దూరంలో మద్యం దుకాణాలు, బార్లు ఉండడంతో ఆకతాయిలకు మరింత అనుకూల వాతావరణంగా మారింది. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు ఈ ప్రాంతం అడ్డాగా మారిందనడంలో ఎలాంటి సందేహం లేదు. కాగా ఉదయం వేళల్లో సుదూర ప్రాంతాల నుంచి తిరుపతికి చేరుకునే కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ల తిరుగు ప్రయాణం రాత్రి కావడంతో విశ్రాంతి తీసుకునే క్రమంలో లూప్‌లైన్ ట్రాక్‌లోకి తరలిస్తున్నారు. వాటిలో రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌తోపాటు వారాంతపు రైళ్లను నిలుపుతున్నారు. ఇలా ఆగి ఉన్న రైలు బోగీలను ఆకతాయిలు తమ అడ్డాగా మార్చుకున్నారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం గంజాయి, మద్యం మత్తులోని ఆకతాయిలు బీడీ, సిగరెట్టు వంటివి కాల్చి ఆగి ఉన్న ఇసాక్ ఎక్స్‌ప్రెస్ రైలు జనరల్ బోగీలో వేసి ఉంటారనే అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయం అగ్ని ప్రమాద సంఘటనా ప్రాంతానికి చేరుకున్న స్థానికులతో పాటు పోలీసు వర్గాల్లో సైతం చర్చకు దారి తీసింది.


మాట్లాడుతున్న రైల్వేస్టేషన్ మేనేజర్

ఆకాయిల కట్టడి సాధ్యమేనా..?

ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వైన్‌షాపుల నుంచి బ్రాందీ, విస్కీ, బీరు తెచ్చుకుని దర్జాగా సేవిస్తున్నారంటూ సమీపం నివాస గృహాల ప్రజలు బాహటంగా చెబుతున్నారు. ముఖ్యంగా మద్యం, గంజాయి మత్తులో వీరంగం చేస్తున్న వారిపై పోలీసులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఎలాంటి మార్పులు లేవనే తెలుస్తోంది. కూత వేటు దూరంలో రైల్వేస్టేషన్‌లోని ఆర్పీఎఫ్, జీఆర్పీ విభాగాలు, మరోవైపు వెలుపలి ప్రాంతంలో ఈస్ట్ పోలీసుస్టేషన్ ఉన్నాయి. అయినప్పటికీ ఆకతాయిల్లో భయమనేది లేదని తెలుస్తోంది. పర్యవేక్షణ కొరవడడంతో రైల్వేట్రాక్‌లపై ఆకతాయిల ఆగడాలు మితిమీరుతున్నాయనే విమర్శలున్నాయి. కాగా సోమవారం మధ్యాహ్నం రైలు బోగీలో అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతంలో చెప్పుకోదగిన సంఖ్యలో పోలీసుల మోహరింపు కనిపించింది. ఏదేని భారీ సంఘటన జరిగితే తప్ప మిగిలిన సమయాల్లో పర్యవేక్షణ అంతంత మాత్రమేనా? అనే సందేహాలకు తావిస్తోంది.

భిన్నంగా స్పందనలు

కాగా రైలు బోగీలో చోటు చేసుకున్న అగ్నిప్రమాదంపై రైల్వేస్టేషన్ మేనేజర్ చిన్నపరెడ్డి, జిల్లా అగ్నిమాపకాధికారి రమణయ్య స్పందించిన తీరు భిన్నంగా ఉంది. ప్రమాదానికి దారి తీసిన పరిస్థితి, నష్టం వంటి వాటిపై విచారణ కమిటీ నివేదిక ఇస్తుందని స్టేషన్ మేనేజర్ చెప్పడం, మరోవైపు తిరుపతిలోని అధిక ఉష్ణోగ్రత కారణంగానే అగ్ని ప్రమాదం సంభవించి ఉంటుందని అగ్నిమాపకాధికారి వెల్లడించడం వంటి అంశాలు ఆసక్తికరంగా మారాయి. మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు వారు చెబుతున్న సమాధానాలకు పొంతన లేదు.

ఇదిగో 'నా రాజముద్ర'

- ఎమ్మెల్యే ఐడెంటీ కార్డును ప్రెస్‌కు చూపిన ఆదిమూలం

సత్యవేడు: 'నేను సత్యవేడు ఎమ్మెల్యేను .. ఇదిగో నా రాజముద్ర.' అంటూ కోనేటి ఆదిమూలం తన ఎమ్మెల్యే ఐడెంటీ కార్డును పార్టీ నాయకులు, అధికారులు, విలేకరులకు చూపారు. సత్యవేడులో సోమవారం అన్నా క్యాంటిన్ భూమిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ఎమ్మెల్యేగా ఎన్నికల్లో పోటీ చేసిన సమయంలో తనని ఓడించాలని కుట్రలు, కుతంత్రాలు చేసిన మాజీ ఎమ్మెల్యే హేమలత, ప్రత్యర్థి పార్టీకి పనిచేసిన వారు నేడు టీడీపీ కార్యక్రమాల్లో స్టేజీలపై ముందు వరుసలో కూర్చొంటున్నారన్నారు. టీడీపీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులు సమావేశాల్లో కింద వరుసలో ఉన్నారని, తగుదునమ్మా అంటూ హేమలత, సతీష్ నాయుడు పలు మండలాల్లో పార్టీ కార్యక్రమాల్లో తిరగడం సిగ్గు చేటని ఎద్దేవా చేశారు. తన పదవి తన దగ్గర ఉంటుందని, ప్రభుత్వ పథకాల కార్యక్రమాలు, సంక్షేమ పథకాల పంపిణీ తన ద్వారానే జరుగుతుందన్నారు. అలాగే పార్టీ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్‌గా కూరపాటి శంకర్ రెడ్డి ఉంటారన్నారు.


సత్యవేడులో తన ఐడెంటీ కార్డును చూపుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

స్నేహితుడా న్యాయమేనా..?

సీఎం చంద్రబాబు నాయుడు 'నీన్ను టీడీపీ ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ గా నియమించారు. స్థానిక శాసన సభ్యుడిగా ఉన్న నన్ను వదిలేసి.. ఎన్నికల్లో నన్ను ఓడించడానికి కుట్రలు పన్నిన హెచ్.హేమలత, చెరుకు పార్టీ వాళ్లని వెంట పెట్టుకుని తిరుగుతున్నావు. మండలాల్లో మీరు చేపట్టే కార్యక్రమాలకు నాకు ఆహ్వానం లేదు. అందరం పార్టీ కోసం పనిచేస్తున్నాం. సీఎం చంద్రబాబు ఆదేశాలు పాటిస్తున్నాం. ఒంటెద్దు పోకడలు వద్దు.. అందరం కలసి సత్యవేడులో పార్టీ అభివృద్ధికి చేయి కలుపుదాం స్నేహితుడా.. శంకర్ రెడ్డి.' అంటూ హితబోధ చేశారు.

నోటీసుల పేరుతో హౌసింగ్ అధికారుల బెదిరింపులు

- లబ్ధిదారులతో దురుసు ప్రవర్తన

రేణిగుంట: జగనన్న ప్రభుత్వంలో పేద ప్రజలకు మంజూరు చేసిన ఇంటి పట్టాలను రద్దు చేయటమే ప్రధాన అజెండాగా పెట్టుకుని ప్రస్తుత హౌసింగ్ అధికారులు ప్రవర్తిస్తున్నారు. పెరిగిన ధరల కారణంగా లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునే పరిస్థితులు లేవు. అదే అదునుగా తీసుకొని లబ్ధిదారుల ఇంటి వద్దకు వచ్చి నోటీసులు అందిస్తూ నాలుగు రోజుల గడువులో స్లాబ్ వేయాలని, లేకపోతే ఇంటి పట్టాను రద్దు చేసి, ఇప్పటివరకు మీరు తీసుకున్న హౌసింగ్ లోన్‌ను ప్రభుత్వానికి తిరిగి కట్టాలని నోటీసులు ఇవ్వటం ఇప్పుడు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. రేణిగుంట మండల ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈ రమేష్ తమ సిబ్బందితో లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి బెదిరింపు ధోరణితో మాట్లాడడంతో లబ్ధిదారులు బెంబేలెత్తుతున్నారు. సోమవారం నోటీస్ అందించి 18వ తేదీ లోపు స్లాబ్ వేయకపోతే మీ ఇంటి పట్టాన్ని రద్దు చేస్తామని నోటీస్ అందించడం విడ్డూరంగా ఉందని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇదే కాక లబ్ధిదారులతో దురుసుగా మాట్లాడుతూ వారి అధికారాన్ని చెలాయిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొస్తే 3.50 లక్షల ఇళ్లు ఇస్తామన్న మాట గాలికి వదిలేసి జగనన్న ప్రభుత్వంలో కొంత వరకు ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులను టార్గెట్ చేసుకుని నోటీసులు అందించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆఖరి నోటీస్ అని నాలుగు రోజులు కాల వ్యవధి ఇవ్వడం ఏమిటని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. 18వ తేదీ లోపు స్లాబ్ వేయకపోతే ఇంటి పట్టా రద్దు చేయమని రెవెన్యూ అధికారులకు సిఫార్సు చేస్తామని హౌసింగ్ అధికారులు చెప్పడంతో మండలంలోని హౌసింగ్ లబ్ధిదారులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. అధికార పార్టీ నాయకుల మెప్పు కోసమో, లేక ఉన్నత అధికారుల వద్ద మంచి పేరు తెచ్చుకునేందుకు తెలియదు గానీ రేణిగుంట హౌసింగ్ అధికారులు తమ పరిధిని మించి అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. హౌసింగ్ అధికారుల తీరు ఇలాగే ఉంటే ప్రజాగ్రహానికి గురవుతారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

తిరుమల క్యాంటీన్లకు ఈఓఐ తేదీల్లో మార్పులు

తిరుమల: తిరుమలలోని 5 పెద్ద క్యాంటీన్లు, 5 జనతా క్యాంటీన్ల కేటాయింపుల కోసం టీటీడీ ఆహ్వానించిన ఈఓఐ పత్రాల జారీ, సమర్పణ, పరిశీలనకు సంబంధించిన తేదీలను పరిపాలనా కారణాలతో మార్పు చేయడం జరిగింది. తాజా షెడ్యూలు ప్రకారం మారిన తేదీలు ఇలా ఉన్నాయి.

పెద్ద క్యాంటీన్లకు
- పత్రాల డౌన్‌లోడ్ ముగింపు తేదీని జూలై 15 నుంచి 26వ తేదీ సాయంత్రం 5 గంటలకు మార్చారు.
- ఈఓఐ పత్రాల సమర్పణ చివరి తేదీని జూలై 17 నుంచి 28వ తేదీ ఉదయం 11 గంటలకు మార్చారు.
- పత్రాల తెరిచే తేదీని జూలై 17 నుంచి 28వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు మార్చారు.

జనతా క్యాంటీన్లకు..
- పత్రాల డౌన్‌లోడ్ ముగింపు తేదీని జూలై 17 నుంచి 28వ తేదీ సాయంత్రం 5 గంటలకు మార్పు చేశారు. ఈఓఐ పత్రాల సమర్పణ చివరి తేదీని జూలై 19 నుంచి 30వ తేదీ ఉదయం 11 గంటలకు మార్పు చేశారు.
- పత్రాల తెరిచే తేదిని జూలై 19 నుంచి 30వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు మార్పు చేశారు. ఆసక్తి గల దరఖాస్తుదారులు మారిన తేదీలను గమనించి, దాని ప్రకారం తగిన విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జాతీయస్థాయి చెస్ పోటీలకు శ్రీగురువర్షిణి

తిరుపతి ఎడ్యుకేషన్ : నగరానికి చెందిన చెస్ క్రీడాకారిణి ఒంటి శ్రీగురువర్షిణి జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఎంపికైంది. విశాఖపట్నంలో ఈ నెల 12, 13వ తేదీల్లో రాష్ట్రస్థాయి అండర్-15 ఓపెన్ అండ్ గరల్స్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో తిరుపతికి చెందిన చెస్ క్రీడాకారిణి ఒంటి శ్రీగురువర్షిణి పాల్గొంది. మొత్తం 7 రౌండ్లకు 6 పాయింట్లతో 4వ స్థానం సాధించి రూ.5 వేలు నగదు బహుమతి, ట్రోఫీని అందుకుంది. అలాగే ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి చెస్ పోటీలకు అర్హత సాధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనుంది. ఈ సందర్భంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన శ్రీగురువర్షిణిని కోచ్ కాకినాడ ప్రసాద్ అభినందించారు.

జాతీయ చేనేత, హస్తకళ విభాగంలో జిల్లాకు మొదటి బహుమతి

– వెంకటగిరి పట్టు చీరల ప్రత్యేకతకు జాతీయ గుర్తింపు


బహుమతిని అందుకుంటున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: ఢిల్లీ ప్రగతి భవన్‌లో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఒన్ డిస్ట్రిక్ ఒన్ ప్రొడక్ట్ కార్యక్రమంలో చేనేత హస్త కళల విభాగంలో తిరుపతి జిల్లా మొదటి బహుమతిని కైవసం చేసుకుంది. సోమవారం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ నుంచి కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ అవార్డు అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో చేనేత, హస్తకళల విభాగంలో తిరుపతి జిల్లా మొదటి బహుమతిని పొందడం చాలా గర్వకారణమని తెలిపారు. వెంకటగిరి పట్టు చీరల ప్రత్యేకతకు జాతీయ స్థాయి గుర్తింపు లభించిందన్నారు. జాతీయస్థాయిలో తిరుపతి జిల్లా హ్యాండ్లూమ్స్, హ్యాండ్ క్రాఫ్ట్ కేటగిరీలో మొదటి బహుమతి (బంగారు కేటగిరి)ని గెలుచుకోవడం చేనేత రంగంలో పనిచేస్తున్న ప్రతి ఒకరి కృషి ఫలితమేనన్నారు. జిల్లాలో ఓడీఓపీ కింద ప్రోత్సహిస్తున్న వెంకటగిరి పట్టు చీరలు, స్థానికంగా తయారు చేస్తున్న చేనేత ఉత్పత్తుల వైశిష్ట్యం, నాణ్యత ఈ గౌరవానికి కారణమని తెలిపారు. ఇలాంటి పురస్కారాలు స్థానిక కళాకారులకు ప్రోత్సాహాన్ని కలిగించడంతోపాటు, వారి జీవనోపాధికి మద్దతుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ జితిన్ ప్రసాద్, ఢిల్లీ సీఎం రేఖ గుప్త, బీసీ వెల్ఫేర్, హ్యాండ్లూమ్స్ మినిస్టర్ సవిత, జిల్లా చేనేత అధికారి రాచపూడి రమేష్ పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చిల్లకూరు: మండలంలోని కాకువారిపాళెం సమీపంలో ఉన్న సొనకాలువ వద్ద ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెంది ఉండడాన్ని సోమవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని తిక్కవరం గ్రామానికి చెందిన గారా అవినాష్ (25) తన అమ్మమ్మ గ్రామమైన కాకువారిపాళేనికి ఆదివారం రాత్రి వెళ్లాడు. అర్ధరాత్రి దాటిని తరువాత అతను ఇంట్లో లేక పోవడంతో బయటకు వెళ్లి ఉంటాడని అతడి అమ్మమ్మ కుటుంబ సభ్యులు భావించారు. అయితే ఉదయం సొన కాలువ వైపు బహిర్భూమికి వెళ్లిన వారు గుర్తించి, కుటుంబ సభ్యులకు తెలియజేశారు.వారు ఇచ్చిన సమాచారం మేరకు ఫిర్యాదు తీసుకుని విచారణ చేపట్టి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అయితే ఆదివారం రాత్రి గ్రామంలో కొంత మంది మధ్య వివాదం నెలకొనడం మృతుడు వారి అమ్మమ్మ ఇంటి వద్దకు వెళ్లి, అక్కడ మృతి చెందడంపై పలు అనుమనాలు వ్యక్తం అవుతున్నాయి.దీంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా గుర్తించినట్లు తెలిసింది.

తీవ్రవాదిలా తీసుకుని వస్తారా?


గూడూరు కోర్టు బయట ఎమ్మెల్సీతో పాటుగా నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

- మాజీ మంత్రి కాకాణిని కోర్టు హాజరులో పోలీసుల అత్యుత్సాహం
- శాసన మండలిలో ఫిర్యాదు చేస్తా
- ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

చిల్లకూరు: మాజీ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డిని నెల్లూరు నుంచి గూడూరు కోర్టులో హాజరుపరిచే విషయంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి, కూటమి ప్రభుత్వం వద్ద మార్కులు కొట్టేసేందుకు ఆయన్ని తీవ్రవాదిని తీసుకుని వచ్చినట్లు తీసుకుని వస్తారా? అని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ప్రశ్నించారు. గూడూరు రెండో పట్టణంలోని వైఎస్సార్‌సీపీ రూరల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరాధారమైన కేసుల్లో మాజీ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డిని అక్రమంగా పోలీసులు అరెస్టు చేసి, పలు కోర్టులకు తిప్పుతున్నారని విమర్శించారు. ఈ క్రమంలోనే మరోసారి పోలీసులు పీటీ వారెంట్ వేసి, గూడూరు కోర్టులో హాజరుపరిచేందుకు తీసుకుని వచ్చే క్రమంలో అప్పటికప్పుడు 144వ సెక్షన్‌ను అమలులోకి తీసుకుని రావడం, రెండో పట్టణంలోని కోర్టుకు మూడు వైపులా ఉన్న దుకాణాలు మూసి వేయడం, పోలీసుల మోహరింపు చూస్తుంటే ఎందుకంత భయమో అర్థం కాలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్‌సీపీ నాయకులను పలు రకాలుగా ఇబ్బందులు పెట్టేందుకు ప్రయత్నిస్తుందని అందులో భాగంగానే కాకాణి గోవర్ధనరెడ్డిపై అక్రమ కేసులు బనాయించారన్నారు. చట్ట సభలో చట్టాలను చేసే తమ లాంటి ప్రతినిధులకు కూడా గూడూరు పోలీసులు అనుమతి ఇవ్వకుండా కోర్టు ఆవరణలోకి వెళ్లనీయకుండా ఎండలోనే గేటు బయట గంటల పాటు ఆపడం మంచి సంస్కృతి కాదని హితవు పలికారు. గతంలో బ్రిటీష్ పోలీసులు భారతీయులపై చేసిన తప్పిదాలను నేడు రాష్ట్ర పోలీసులు గుర్తు చేస్తున్నారని, దీంతోనే మాజీ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డిని కోర్టుకు తీసుకు వచ్చే సమయంలో పలు రకాల ఆంక్షలు విధించడం దారుణమైన విషయమని అన్నారు. తనతో పాటుగా నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తమ పార్టీ మండల కార్యాలయంలో ఉంటే అక్కడకు వచ్చి బయటకు వస్తే కేసులు బనాయిస్తామని హెచ్చరించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయకుమార్‌రెడ్డి, సన్నారెడ్డి శ్రీనివాసులరెడ్డి, పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, కోట జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల ప్రసాద్‌గౌడ్, యూత్ రాష్ట్ర కార్యదర్శి కొండూరు సునీల్‌రెడ్డి, గూడూరు ఎంపీపీ బూదూరు గురవయ్య, నాయకులు గొట్టిపాటి రవీంద్రరెడ్డి, కామిరెడ్డి కస్తూర్‌రెడ్డి, ఓడూరు బాలక్రిష్టారెడ్డి, బాబురెడ్డి, అట్ల శ్రీనివాసులరెడ్డి, యల్లా శ్రీనివాసులరెడ్డి, సాయిరెడ్డి, దీప్తి పాల్గొన్నారు.

ఒకే ఆటోలో 25 మంది విద్యార్థుల ప్రయాణం

– పాఠశాల విలీన ఫలితం


ఆటోలో కిక్కిరిసిపోయిన విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం రద్దు చేయడంతో మరో పాఠశాలకు వెళ్లటానికి విద్యార్థులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. దీంతో కొంతమంది ఆటోవాలాలు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించటానికి వెనుకాడడం లేదు. మండలంలోని మొక్కలచేను గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాలను రద్దు చేసి కల్లివెట్టులోని ప్రైమరీ పాఠశాలలో విలీనం చేశారు. మొక్కలచేను గిరిజన కాలనీలో 25 మంది పిల్లలు చదువుకుంటున్నారు. మొక్కలచేను గిరిజన కాలనీ నుంచి కల్లివెట్టు పాఠశాలకు మూడు కిలోమీటర్ల దూరం ఉంటుంది. కల్లివెట్టు పాఠశాలకు వెళ్లటానికి 25 మంది విద్యార్థులు ఒకే ఆటోలో వెళుతున్నారు. పాఠశాల విలీన ఫలితంగానే విద్యార్థుల ప్రాణాలు పణంగా పెట్టాల్సి వస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

ఘరానా దొంగ అరెస్ట్


పట్టుబడి నగలను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్: జిల్లాలోని నాయుడుపేట, సత్యవేడు ప్రాంతాల్లోని ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఘరానా దొంగను సూళ్లూరుపేట పోలీసులు అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్పీ తెలిపిన వివరాల మేరకు, ఈ నెల 5న గుర్తు తెలియని వ్యక్తి నాయుడుపేటలోని మూగాంబికా దేవాలయం వీధిలో నివాసం ఉంటున్న గంగినేని హరేంద్ర ఇంట్లో చోరీ జరిగింది. సుమారు 416 గ్రాముల బంగారు నగలు దోచుకుని పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు సూళ్లూరుపేట డీఎస్పీ చెంచు బాబు, సీఐ బాబీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. పార్వతీపురం జిల్లాకు చెందిన చందాక మణికంఠ(28) అనుమానాస్పదంగా తిరుగుతుంటే నాయుడుపేటలో అరెస్ట్ చేశారు. ఎవరికీ అనుమానం రాకూడదని ఉద్దేశంతో పార్వతీపురం నుంచి ఇక్కడికి వచ్చి దొంగతనాలు పాల్పడేవారు. ఇతనిపై సూళ్లూరుపేట పరిధిలో ఐదు కేసులు నమోదయ్యాయి. అంతేకాకుండా తడ, శ్రీ సిటీ, వరదయ్యపాళెం పోలీస్ స్టేషన్లో ఒక కేసు విశాఖపట్నం కమిషనరేట్ పరిధిలోని మొవ్వలవారి పాళెం పోలీస్ స్టేషన్లో మూడు కేసులు, ద్వారక పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు కేసులు ఉన్నాయి. సుమారు ఇప్పటివరకు 14 కేసులకు పైగా ఉన్నట్లుగా గుర్తించారు. నాలుగు కేసులకు సంబంధించి 416 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి ఇతన్ని రిమాండ్‌కి తరలించినట్లు ఎస్పీ తెలిపారు.

అధునాతన టెక్నాలజీకి పెద్దపీట


సదస్సులో మాట్లాడుతున్న వీసీ అప్పారావు

తిరుపతి సిటీ: అధునాతన టెక్నాలజీకి ఎస్వీయూ పెద్దపీట వేసి, విద్యార్థులను ఆ దిశగా ప్రోత్సహిస్తుందని వీసీ ప్రొఫెసర్ అప్పారావు పేర్కొన్నారు. వర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ట్రిపుల్ ఈ విభాగం ఆధ్వర్యంలో ఎలక్ట్రిఫైయింగ్ ది ఫ్యూచర్ ఇన్నోవేషన్, చాలెంజింగ్ అండ్ సస్టైనబుల్ మొబిలిటీ అనే అంశంపై రెండు రోజు పాటు జరగనున్న అంతర్జాతీయ సదస్సు సెనేట్ హాల్‌లో సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి వీసీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ట్రిపుల్‌ఈ విభాగం మరింత అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. నూతన టెక్నాలజీకి సంబంధించి మరిని పరికరాలు ఏర్పాటు చేసేందుకు నిధుల విడుదలకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కొరియా యంగ్ హీ వర్సిటీ ప్రొఫెసర్ జూసూయా, డీన్ మల్లికార్జున రావు, ఉస్మానియా వర్సిటీ ప్రొఫెసర్ శ్రీనాథ్‌రెడ్డి, ప్రిన్సిపల్ జి శ్రీనివాసులు, హెచ్‌ఓడీ ప్రొఫెసర్ జీఎస్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.